
పాతిక దొంగకు పరక దొంగ ఎదురవుతారు, హారాహుషార్!

మూడవ నెంబర్ ఫ్లాట్‌ఫారం మీదకు ఎలాగో దేక్కుంటూ వచ్చి ఆగింది సర్కార్ ఎక్స్‌ప్రెస్. ఆగింది అనడంకన్నా కాసేపు కాపురం పెట్టింది అనడం మేలు.




# తేలుకుట్టిన పాము

— బాలి.

"ఖాళీగానే ఉంది. ఎక్కడ కూచున్నా ఫరవాలేదు అయినా గుంటూరులో కిటకిటలాడిపోతుందిలే బండి — నీ సూట్‌కేసు ఇక్కడ పెట్టనా" అన్నాడు శీతారావుడు.

అప్పటికి ఓ గంట నుంచీ నాకు కంపెనీ ఇస్తున్నాడు. వాడే లేకపోతే నా కసలు మతిపోయి వుండేది. బజారులో అదీ ఇదీ కొంటూ తిరిగాం- తిరిగినంతసేపూ కబుర్లు చెప్పాడు- స్టేషన్‌కు చేరుకొని ఎంక్వయిరీ చేస్తే ఓ అరగంటలేటన్నారు. పాపం అప్పుడూ విసుక్కోకుండా కబుర్లు చెబుతూనే వున్నారు.

అయితే ఇప్పుడు వాడి ముఖం అదోలా వుంది. "ఏవన్నా కబుర్లు చెప్పరా— వింటాను అన్నాను-" అంతే వాడు సర్రున లేచాడు.

"ఇక వాగలేనురా బండి వచ్చింది కదా" అన్నాడు.

"వచ్చిందే అనుకో— అది బయలుదేర వద్దూ- అంతవరకూ కాలక్షేపం."

"అయితే నేనుకాలక్షేపం బఠాణీనట్టా నా నోరు నొప్పిపెడుతోంది-మరి టాటా" నేనింకా వాడ్ని బ్రతిమిలాడదామనుకొన్నంతలో .... చకచకా మెట్లెక్కి ఓవర్ బ్రిడ్జిమీద కెళ్ళిపోయాడు.

నా ప్రాణం ఉసూరుమంది. ప్లాట్‌ఫారంమీద మనుషులను చూస్తూ దగ్గర్లో సిమెంట్ బల్లమీద చతికిలబడ్డాను.

ఎవరెవరో వస్తున్నారు. కొంతమంది కంగారుగా ....మరి కొంతమంది తాపీగా మరి కొంతమంది ఏమీ పట్టనట్టు క్రింద చతికిలబడి, కబుర్లు చెప్పుకొంటున్నారు.

ఇంతమందిలోనూ నన్ను ఆకర్షించింది కుళాయి చప్టామీద చతికిలబడి మొక్కజొన్నపొత్తు తింటున్న ఓ పాతికేళ్ళ పడుచు. హుషారుగా కాళ్ళు ఆడిస్తూ గింజలు నోట్లోకి విసురుకొంటోంది. బరబరమని విపరీతంగా ఆడిస్తున్న నోట్లోంచి చిన్న కూనిరాగంకూడా వినిపిస్తోంది. ఆ చూపులో, తల త్రిప్పడంలో ఏదో నిర్లక్ష్యం! బండిని ఆ చివర, ఈ చివరతల ఆడిస్తూ చూస్తోంది.

కొంచెం జరిగింది. ముందుకి వంగి క్రిందపడిన గింజనుతీసి నోటివేపు విసురుకొంది. ఆ వంగడంలో వడిలో దాచిన మరో రెండు మొక్కజొన్న పొత్తులు, కొంచెం చిల్లరా, చిరుగులున్న తెల్లగుడ్డ ముక్కా క్రిందపడ్డాయి. వాటిని ఎడమ చేత్తో పోగుచేసి దగ్గరకు లాక్కొంది.

నాకు మంచి కాలక్షేపమే దొరికింది.

ట్రైన్ యెక్కి ఆమె కనపడేవేపు కిటికీకి దగ్గర కూచున్నాను. ఇంతలో అట్నుంచి ఓ మాదిరి లావుపాటి పోర్టర్ జోరుగా వెళుతున్నాడు. వెళుతూనే ఈ అమ్మాయివేపు చూసి ఓ చిరునవ్వు విసిరాడు.

అది వాడిమీదకు ఓ జొన్నగింజ విసిరింది.

వాడు చటుక్కున ఆగిపోయి పళ్ళెం పడేసినట్టు భళ్ళున నవ్వాడు. "ఏమోలే! సరోజినీ.... ఈ మధ్య ఎక్కడా అగపడనేదు" అన్నాడు. మూతి మూడువంకర్లు తిప్పి - ఎక్కడన్నా గింజ మిగిలిపోయిందేమో అని పొత్తుని చుట్టూ తిప్పిచూసుకొంటోంది. మళ్ళీ బయలుదేరుతూ దాని వేపే చూస్తూ ఆ పోర్టర్ అన్నాడు.

"ఎటో చెక్కేస్తోంది దొంగ నెంజ — ఇసాపట్నం అమ్మేసింది. రాజమందరం అయిపోయింది - ఉప్పుడు ఈ బెజవాడీన్ని అమ్మేసిందిగావాల - మెడ్రాస్ గాని సెక్కేస్తన్నావేటే.... ముంగినా మాటాడవూ ...."

తనకు వినపడనట్టే ఊరుకుంది.

"పాపం మాటలు రావంటే — అన్నీ సేతలే...."

ఈమారు ఆ అమ్మాయి కొంచెం సంతోషంగా చూసి ఎంగిలి కండెను వాడి మీదకు విసిరింది—

వాడు తమాషాగా పక్కకు తప్పుకున్నాడు-'కోపం వచ్చేసిందండీ చిలక్కి. కోపంవస్తే మనం ఆగలేం మరి—'అంటూ భుజంమీద తువ్వాలు సవరించుకొంటూ వెళ్ళిపోయాడు పరుగులాంటి నడకతో—

"దొంగనెంజనంట- దొంగనెంజను- నిలబడినాడు గాదు-సెప్పుదును.పోనీకదా!- ఎరుగున్న ముఖంకదా అని వల్లకుంటే ఎంతెంత మాటలంతున్నాడూ-" కోపం, నవ్వూ మిళితంచేస్తూ అటొక్కసారిచూసి వడిలోంచి మరో పొత్తును పైకితీసింది.

గింజలు వలిచి నోట్లో వేసుకొంటూ మళ్ళీ కాళ్ళు ఆడించడం మొదలుపెట్టింది.

ఇదంతా అలాఎంతసేపు జరిగిందో తెలీదు. పెట్టెలోకి చూస్తే జనం బాగానే కూచున్నారు.మరికొంతసేపటికి బండి కదిలింది. నేను ఆతృతగా కుళాయి చప్టా వేపు చూశాను.అక్కడ ఆ సరోజిని లేదు· ఈ కంపార్ట్‌మెంట్‌లో నా యెదురుగా నేలమీద లావెటరీ గుమ్మానికి ఆనుకొని కూచునివుంది. నాకెంతో సంతోషంగా వుంది. ఏ వూరు వస్తుందో ఏమో-మద్రాసుకే వస్తే మరీమంచిది· భలే కాలక్షేపం.

ఇంత త్వరగా నేను దిగేదిలేదు అన్నట్టు ఒడిలోని చింకిబట్టను నేలమీద తలవేపు పెట్టుకొని పైకప్పువేపు చూస్తూ కాళ్ళు ఆడిస్తూ - మొక్కజొన్నపొత్తును నములుతోంది· చాలాసేపు అదే దృశ్యం.

బండిచిన్న కుదుపుతో గుంటూరు స్టేషన్‌లో ఆగింది- బిలబిల మంటూ పెట్టెలోకి చాల మంది చొరబబడ్డారు. నీలం చొక్కా, నల్లరంగు ప్యాంట్ - దానికి అరచేయి మందాన బెల్టు టక్ చేసి, సిగరెట్ పొగ వదుల్తూ ఓ వ్యక్తి పరుగున వచ్చి నా ముందు బల్లమీద కూర్చున్నాడు. మరి కొంతసేపటికి గుమ్మానికి అడ్డంగావున్న వాళ్ళని నెట్టుకొంటూ మరో అమ్మాయి ఎక్కింది.

మనిషి బాగా పొట్టి - మెడవరకూ కత్తిరించిన బిరుసు జుట్టు. ఆ జుట్టుకు నూనె లేదు. మెల్లకళ్ళు, ముందు రెండుపళ్ళు ఎత్తు- కొంచెం శుభ్రమైనవే తెల్లని బట్టలు కట్టింది- చేతులు నల్లగా కాల్చిన కర్రల్లా ఉన్నాయి. చేతిలో ఎప్పటిదో ఓ ఇంగ్లీష్ డైలీ పేపర్—

వేళ్ళతో జుట్టు గిరుకొంటూ, వస్తూనే అందరివేపూ చూసింది.

"ఏం జనాలురా బాబూ!! అంతా జనమే" అని గొణుక్కొంటూ వెర్రి










నవ్వు నవ్వుకొంటూ నేలమీద పేపరుతో తుడుచుకొని కూచుంది.

"ఇదికూడా మద్రాస్ చెక్కేస్తోంది కాబోలు" అనుకున్నాను. కాసేపు కాళ్ళు చాచుకొని కూచుంది. మళ్ళీ కాళ్ళు ముడుచుకొంది. పేపర్ వళ్ళో వేసుకొని రెండుచేతులూయెత్తి తనివితీరా బుర్రంతా గోక్కుంది. మళ్ళీ పేపరును తీసుకొని మెడదగ్గర జాకెట్‌ను వదులుచేసి విసురుకొంది. "టైం' ఎంతవుద్దండీ మాష్టారూ?" ఎవర్ని అడిగిందో తెలీదుకాని అందరూ


సినీ తారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదం ఫొటోల సెట్టు 5 రూ. ఎయన్నార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజుల ఫొటోల సెట్టు 6 రూ. తెలుగు, హిందీతారల అడ్రసులు (ఫోనునంబర్లతో సహా) గల పుస్తకం 2 రూ. ఎం.ఓ. చేయండి!
SUVARNA
వై.కె.మూర్తి
దాసరివారివీధి. విజయవాడ-2

మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్ & బాల్ పెన్నుస
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారుచేయబడుచున్నవి.
అశోకా పెన్‌వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

దీర్ఘవ్యాధులకు ఉత్తమవైద్యం
దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యంపొందలేనివార్కి హెర్నియా, చర్మవ్యాధులకు పోష్టుద్వారా వరిబీజం (బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ (గ్యాస్ట్రిక్) మూత్ర, స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
5/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.


వాచీలువేపు చూసుకొని మళ్ళీ తమ తమ పనుల్లోకి మునిగిపోయారు.

"గాల్లేక సస్తున్నాను. ఎప్పుడు బయలుదేరుతుందో?"

"ఇక బయలుదేరుతుంది" నీలంచొక్కా సమాధానంయిచ్చి అందరివేపూ చూశాడు.

అంతలోనే బండిలో చిన్న కుదుపు వచ్చింది.

"సార్! సార్!! బండి బయలుదేరినట్టుందికదూ!" నీలం చొక్కాని పలకరించింది.

"ఆఁ ఏం నీకేమన్నా గాలేస్తోందా!" తన జోక్‌కి తనే మురిసిపోయి చిన్నగా నవ్వాడు.

అదీ ఓ వెర్రినవ్వు నవ్వింది—

"మేష్టారూ- ఇప్పుడు పదిగంటలవుతుందేమోనండీ! హబ్బబ్బ మనం నేరకపోయి ఈ దున్నపోతుల బండి ఎక్కాం సార్" అని గొల్లున నవ్వింది.

నీలంచొక్కా ఇక అటు చూడలేదు.

అలా ఎంతసేపు గడిచిందో తెలీదు—

చిన్నగా నిద్రవస్తోంది- మధ్య మధ్య చూస్తున్నాను- ఆ తెల్లచీర అమ్మాయి తల బరుక్కోవడమో- పేపరుతో విసురుకోవడమో- లేక పేపరంతా విప్పి ఏదో చదవడమో చేస్తోంది.

నేను కూచున్న స్థలానికి సరోజిని కాళ్ళే కనిపిస్తున్నాయి - నిద్రపోతోందో - లేక మొక్కజొన్న పొత్తు తింటోందో తెలీదు. నీలంచొక్కా లేచాడు - రెండడుగులు అటువేపు వేసి చటుక్కున వెనక్కు తిరుగుతూ.

"ఛఛ- ఈ అమ్మాయి లావెటరీకి అడ్డంగా పడుకొందేమిటి?" అన్నాడు.

"ఎవరు మేష్టారు- ఆ అమ్మాయేనా-" అంది తెల్ల చీర.

"అది అంతే సార్! దొంగముండ—కాకిలా ఆ బండీ, ఈ బండీ ఎక్కుతుంది. దాని పని నేను చెప్తానుండండి" అని ముడుకులమీదకు వంగి సరోజిని కాళ్ళను పడపడ కొట్టి "ఓ అమ్మాయ్ లేలే!! ఏమిటా నిద్రా" అని అరిచింది.

నీలం చొక్కా సీట్లో చతికిలబడ్డాడు.

హామీ ఇచ్చినట్టు నీలం చొక్కావేపు ఓసారి చూసి మళ్ళీ వంగి— "ఓఅమ్మాయ్ లే!లే!!- ఆ బాబుగారు దొడ్లో కెళ్ళాలంట. నీ అమ్మ మొగుడు సొమ్ములా అడ్డంగా నిద్దరోతున్నావేమిటి" అని కాళ్ళు పట్టుకొని గుంజింది.

సరోజిని కాళ్ళు దగ్గరగా లాక్కొని

## సమూహ సముద్రం

కవిత్వమే కాదు
ఏకాంతంగా నువ్వు ఏ సాహిత్యవీధిలో
నడుస్తున్నా నీ చూపులు వాలిన చోట
అక్షరాలు ఉవ్వెత్తున లేచి
అడివి మంటల్లా నీ ఆలోచనలవెంట
తరుముకుంటూ రాకపోతే

నీ రక్తాన్ని రగల్చకపోతే
చచ్చిన ఈగల్లా దోమల్లా కీళ్ళిరిగిన
కీటకాల్లా
కాగితాన్నతుక్కునే వుండిపోతే
అప్పుడు ఖచ్చితంగా నువ్వు
అక్షర స్మశానంలో నడుస్తున్నా
వన్నమాట

కవిత్వమే కాదు
మనుషులూ అంతే
అన్యాయాలపై తుఫాను సముద్రాలుగా
విరుచుకపడకపోతే
చచ్చి నేల కతుక్కున్న శవాలే!
నువ్వు గోరీల మధ్య జీవిస్తున్నా
వన్న మాట!
కదం తొక్కే కడలి
మనుషుల ముఖాల్లో కనబడే చోటికి
వెళ్ళు
గోరీల మీదికి కడలిలా దూకు
విస్తరిస్తున్న స్మశానాన్ని
సమూహ సముద్రశక్తితో ఆపు.

—నగ్నముని

గుండెలమీద పైటని ప్రక్కకు పారేసి మరోప్రక్కకు తిరిగింది.

"ప్చ్-యిది మనిషికాదండి మేష్టారూ పత్తి గొడ్డు. దున్నపోతంటే యిదేనండీ. ఎంత కొట్టినా లెగదు చూశారా-ఏ ఊరు వెళ్తుందోగాని" అంది.

"ఇక లేపకు" అన్నాడు మెల్లగా నీలం చొక్కా.

"అలా అనకండి సార్. ఇవాళ యిదయింది, రేపు మరొకటి అవుద్ది" అని

మళ్ళీ పాతపాటే మొదలెట్టింది. అందరూ అటే చూస్తున్నారు.

"ఓ అమ్మాయ్ లెగులెగు ఆ బాబుగారు. పైటన్నా కానటంలేదు దొంగముండ.... దీని అమ్మ మొగుడు సొమ్మనీ దొడ్డి గుమ్మానికి అడ్డంగా.... వచ్చే టేషన్‌లో టి. సి.కి అప్పజెప్పేయండి సార్- దీని తిక్క అణిచేస్తాడు.... దీన్ని ఇలాక్కాదు-" అంటూ రెండు చేతుల్తోనూ దాని పిర్రల మీద బాది "నెగునెగు.... ఆ మేష్టారు.... దొడ్లోకి" అని రెండు చేతులలోనూ దాని మెడను పట్టుకొని కూచోపెట్టింది. తల క్రింద గుడ్డలో మొక్కజొన్నపొత్తూ, కొంచెం చిల్లరా కనిపిస్తోంది.

"ఓ అమ్మాయ్- ఇలా కూచో- ఆ బాబుగారు దొడ్లోకెళ్ళాలంట."

"ఏ బాబు-" అంది సరోజిని మగతగా.

"ఆ బాబు....ఆ నీలం చొక్కా బాబు ఇందాకట్నించీ కడుపు పొంగిపోయి వస్తున్నాడు- ఆ పక్కకుపోయి కూచో-"

అంతే! సరోజిని—

రెండు చేతులతోను దాన్ని విడిపించుకొని "నానేమన్నా పర్వతాన్నంటే! దాటి వెళ్ళిపొమ్మను- దొడ్లోకి ఎళతాడో, ఏట్లో కెళతాడో- ఎళ్ళమను- నానేమన్నా వద్దన్నానా! అంత సక్కటి నిద్ర— పాడు చేసింది పాపిష్టిముండ— దీని వదినను కుందో- మరదల్ని అనుకుందో- వంటి మీద సెయ్యేసి లేపుతుందండీ.... పాటుకత్తె" తలక్రింద గుడ్డను సర్దుకొని పైట సర్దుకొని తిరిగి పడుకొంది—

"చూశారా బాబూ— దీని పొగరు.... బికారి ముండ. కేటుముండ. నన్నెంతంత మాటలన్నదో చూస్తున్నారా మేష్టారూ ఇది కలికాలం సార్. న్యాయం లేదు— ధర్మం లేదు. వచ్చే స్టేషన్‌లో దీన్ని టి.సి.కిచెప్పి పటించెయ్యండి సార్— మనం నిద్రపోతే మన సామాన్లు కూడా పట్టుకుపోతుందిసార్ ఏం మేష్టారూ అంతేనా" అంటూ అందర్నీ చూసి పెద్దగా అరిచింది.

నీలంచొక్కా వేపు అందరూ సానుభూతిగా చూశారు. తల వంచుకొని సిగరెట్ ముట్టించుకున్నాడు. ఆ తరువాత ఎక్కడ దిగిపోయాడో తెలీదు.

నెల్లూరు వచ్చింది. హడావుడికి తెలివి వచ్చింది.

"హబ్బబ్బ యిలాంటి ప్రయాణం నేనెప్పుడూ చెయ్యలేదు బాబూ" అంటూ తెల్లచీర దిగిపోయి జనంలో కలిసిపోతోంది.

బాగా తెల్లవారేసరికి బండి మద్రాస్ బీచ్ స్టేషన్‌కి చేరింది.

అప్పటికే సరోజని లేచి ఏడుస్తూ, వెతుక్కుంటూ మధ్య మధ్య తిడుతోంది.

ఆగి అటు చూశాను.

"ఏముండ తీసిందో భగమంతుడా! తలక్రింద దాచిన గుడ్డముక్క, దాన్ని కట్టిన ఐదు రూపాయల చిల్లరా, పోతులా వున్న మొక్కజొన్న పొత్తూ అన్నీ పోనాయి. నాకన్నా సన్నాసి నా కొడుకెవల్లో తీసి వుండాల.... ఆళ్ళ చేతులు పడిపోను ఓరి భగమంతుడా...." అని రాగాలు మొదలుపెట్టింది.

మేలుకొన్న నారీలోకం కోరుకొనే కుట్టుమిషన్

వనితాలోకంలో సంచలనానికి నాంది
స్వాతి కుట్టుమిషను పునాది
నిశ్శబ్దంగా నడిచేది సున్నితంగా పని చేసేది

స్వాతి*

అద్భుతమైన నాణ్యం,
అపురూపమైన వనితనం,
అందమైన రూపం
మూడు ఉత్తమ గుణాల
సంగమం




SWATHI*

సుదృఢమైన నిర్మాణానికి ప్రతీక